కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -267 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 07-10-2026 బుధవారం పేజీలు : 4

# సీఎం మాటలు సిరిసిల్ల మూటలు?

- సిరిసిల్లకు ఏం ఇచ్చారు?
- సీఎంపై కవిత ఫైర్
- రాజన్న ఆలయంపై సీరియస్
- వేములవాడ సమస్యలపై గళం
- కాళేశ్వరంపై కీలక ప్రశ్నలు
- రైతులకు కరెంట్ ఇవ్వాల్సిందే
- రుద్రంగి రిజర్వాయర్ ఏమైంది?
- నేరెళ్ల బాధితులకు న్యాయం ఏదీ?
- 'రాజకీయాలు కాదు.. అభివృద్ధి చేయండి'



**న్యూస్ డెస్క్, 06 అక్టోబర్ (బిఎన్ఎస్):** వేములవాడ పట్టణంలో టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు 'కవిత' మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలను ఆమె ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రం, టీఆర్ఎస్ పార్టీ బాగుండాలని రాజన్నను వేడుకున్నట్లు ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

వేములవాడ రాజన్న ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని.. ఆలయానికి ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించడంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ పడుతున్నాయని, ఎవరు నిధులు ఇచ్చినా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఆలయ నిర్మాణంలో కాంక్రీట్‌కు బదులుగా కృష్ణశిలను ఉపయోగించాలని ఆమె కోరారు. రాజన్న ఆలయంలో కోడెలు మృతి చెందుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి బండి సంజయ్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

వేములవాడలో రోడ్లు, మార్కెట్, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని కవిత పేర్కొన్నారు. చేపట్టిన పలు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, రైతుల కోసం సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వేములవాడ పట్టణంలో దుమ్ము సమస్య తీవ్రంగా ఉందని, డ్రైనేజీ పనులపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని కోరారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

రాజన్న చెరువు ప్రక్షాళన కోసం విప్ ఆది శ్రీనివాస్ నిధులు తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు. గతంలో కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో సిరిసిల్లను అభివృద్ధి చేశారని, ప్రస్తుతం వేములవాడ అభివృద్ధి బాధ్యతలు చూస్తున్న ఆది శ్రీనివాస్ నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టాలని అన్నారు. అధికార దర్పం కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. తన తల్లిదండ్రుల వివాహం కూడా వేములవాడలోనే జరిగిందని కవిత గుర్తుచేశారు. ఈ ప్రాంతంతో తమ కుటుంబానికి అనుబంధం ఉందన్నారు.

మిగతాది 2 లో..

# తాగేవారిపైనే ప్రివిలేజ్ ఫీ భారం!


2 లో

**న్యూస్ డెస్క్, 06 అక్టోబర్ (బిఎన్ఎస్):** రాష్ట్రంలో ప్రివిలేజ్ ట్యాక్స్ రద్దు చేయాలంటూ తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చేపట్టిన నిరసనలపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. ఈ పన్ను వల్ల బార్ల యాజమాన్యాలకు ఎలాంటి నష్టం ఉండదని, కేవలం మద్యం తాగే వారిపై మాత్రమే స్వల్ప భారం పడుతుందని ఆయన స్పష్టం చేశారు. మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో మాట్లాడుతూ మంత్రి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

# గోషామహల్ ఓట్లపై ఒవైసీ ఫిర్యాదు!


2 లో

**న్యూస్ డెస్క్, 06 అక్టోబర్ (బిఎన్ఎస్):** స్టేట్ పాలిటిక్స్‌లో ఓట్ల తొలగింపు వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. హైదరాబాద్‌లోని గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లను తొలగించేందుకు భారీ కుట్ర జరుగుతోందని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన ఆరోపణలు చేశారు.

# మళ్లీ వణుకుపుట్టిస్తున్న 'బర్డ్ ఫ్లూ'

- 2,500 కోళ్లు మృత్యువాత
- ఆదిలాబాద్ నుంచి వచ్చిన కోళ్లలో వైరస్
- భోపాల్ ల్యాబ్‌లో నిర్ధారణ
- సిద్ధరాంపురంలో కంటైన్మెంట్ చర్యలు
- 10 కి.మీ పరిధిలో నిఘా
- మూడు నెలలు రవాణాపై ఆంక్షలు
- జ్వరం, దగ్గుపై అప్రమత్తంగా ఉండాలి


2 లో

**న్యూస్ డెస్క్, 06 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ మళ్లీ వణుకు పుట్టిస్తోంది. తెలంగాణలోని ఆదిలాబాద్ నుంచి అనంతపురం జిల్లాకు దిగుమతి చేసుకున్న కోళ్లలో ఏవియన్ ఇన్‌ఫ్లుఎంజా వైరస్ పంజా విసరడంతో కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే ఏకంగా 2,500 కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన స్థానికంగానే కాకుండా రెండు రాష్ట్రాల్లో పౌల్ట్రీ పరిశ్రమలో తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోంది. అనంతపురం జిల్లా సిద్ధరాంపురానికి చెందిన వెంకటరాముడు అనే వ్యక్తి జాతీయ పశుసంవర్ధక మిషన్ కింద ఇటీవల ఈ పౌల్ట్రీ ఫారమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తెలంగాణలోని ఆదిలాబాద్ ప్రాంతం నుంచి ఒకే బ్యాచ్‌లో 2,500 కోళ్లను ఫారమ్‌కు తీసుకొచ్చారు. అయితే, ఆ కోళ్లు ఫారమ్‌కు చేరుకున్న కొద్ది రోజులకే అనారోగ్యం బారినపడి ఒక్కొక్కటిగా చనిపోవడం ప్రారంభించాయి.

# మీజిల్స్ విజృంభణ.. న్యూయార్క్ అలర్ట్!


2 లో

- రాష్ట్రవ్యాప్తంగా డిజాస్టర్ హెల్త్ ఎమర్జెన్సీ
- నవంబర్ 4 వరకు కొనసాగనున్న అత్యవసర పరిస్థితి
- తక్కువ వ్యాక్సినేషన్ ప్రాంతాల్లో వేగంగా వ్యాప్తి
- పిల్లలు, పెద్దల్లో పెరుగుతున్న మీజిల్స్ కేసులు
- ఎంఎంఆర్ టీకాల పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు
- తప్పుడు సమాచారాన్ని నమ్మొద్దు..
- వ్యాక్సిన్ తీసుకోవాలన్న అధికారులు

# రాహుల్ గాంధీ ఆరోపణలు అవాస్తవం



2 లో

- రాహుల్ గాంధీ ఆరోపణలు అవాస్తవమన్న ఈసీ
- ఫామ్-6 మార్పులు ఏకపక్షం కాదని స్పష్టీకరణ
- కమిషన్ పూర్తి ఆమోదంతోనే నిర్ణయాలంటూ వెల్లడి
- ఎస్ఐఆర్ ఆదేశాలకు సుప్రీంకోర్టు మద్దతు
- సెప్టెంబర్ 26 ప్రెస్‌నోట్‌లోనూ ఇదే అంశంపై క్లారిటీ
- ఆధారాలు లేని ఆరోపణలతో అపోహలు వద్దన్న అధికారులు

# పెరగనున్న విద్యుత్ ఛార్జీలు

- నవంబర్ నుంచి అదనపు బిల్లులు
- డిసెంబర్ నుంచి యూనిట్‌కు 50 పైసలు
- రూ.5,420 కోట్ల ట్రూఅప్ భారం
- వ్యవసాయ భారం ప్రభుత్వానిదే
- రైతులపై అదనపు ఛార్జీలకు నో
- 26--29 నెలల పాటు వసూళ్లు
- గృహ, వ్యాపార వినియోగదారులపై భారం



2 లో

**న్యూస్ డెస్క్, 06 అక్టోబర్ (బిఎన్ఎస్):** తెలంగాణలో విద్యుత్ ఛార్జీలు పెరగనున్నాయి. వచ్చే నెల నుంచి వినియోగదారులకు అదనపు బిల్లుల మోత మోగనుంది. గత ఆర్థిక సంవత్సరాల్లో విద్యుత్ కొనుగోలు వ్యయం, ఆదాయ లోటును సర్దుబాటు చేసుకునేందుకు రూ.5,420.23 కోట్ల ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేసేందుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ).. డిస్కంలకు అనుమతులు ఇచ్చింది. ఈ ఛార్జీల వసూలును ఈ ఏడాది నవంబర్ నుంచి జారీ చేసే విద్యుత్ బిల్లుల నుంచే ప్రారంభించాలని ఆదేశించింది. మొదటి నెల యూనిట్‌కు 30 పైసలు.. డిసెంబర్ నుంచి యూనిట్‌కు 50 పైసల చొప్పున అదనంగా వసూలు చేయనున్నారు. అయితే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై ఈ భారాన్ని వేయకుండా.. రైతుల పడే మొత్తం భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం నుంచి వసూలు చేయాలని కమిషన్ స్పష్టం చేసింది.

విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ అనంతరం ఈఆర్సీ ఈ నిర్ణయం తీసుకుంది. 2022-23లో విద్యుత్ కొనుగోలుకు అయిన అదనపు వ్యయం.. 2023-24లో ఏర్పడిన ఆదాయ లోటును కలిపి మొత్తం రూ.7,635.22 కోట్లను వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు డిస్కంలు అనుమతి కోరాయి.

# ఏపీపీఎస్సీ గ్రూప్-1కు గ్రీన్ సిగ్నల్!

- 166 పోస్టుల భర్తీకి ప్రకటన
- 13 విభాగాల్లో భారీగా ఖాళీలు
- డీఎస్పీ పోస్టులే 39
- డిప్యూటీ కలెక్టర్ పోస్టులు 12
- అక్టోబర్ 27 వరకు దరఖాస్తులు
- రూ.1.54 లక్షల వరకు జీతం

2 లో

# ఏపీలో పాక్ స్పై నెట్‌వర్క్!

- హనీట్రాప్‌లో చిక్కుకున్న నేవీ ఉద్యోగి
- 'ఆపరేషన్ ఫైర్‌వాల్'తో బట్టబయలు
- 10 రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు
- 18 మంది అనుమానితుల గుర్తింపు
- 13 మంది నేవీ సిబ్బందిపై అనుమానం
- ఎన్‌క్రిప్టెడ్ ఛానళ్లతో సమాచారం లీక్


2 లో

**న్యూస్ డెస్క్, 06 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లో పాకిస్థాన్ గూఢచర్య నెట్‌వర్క్ తీవ్ర కలకలం రేపుతోంది. పాకిస్థాన్ పన్నిన 'హనీట్రాప్' వలలో చిక్కుకుని, దేశ రక్షణ రంగానికి చెందిన అత్యంత రహస్య సమాచారాన్ని శత్రుదేశానికి చేరవేసిన వ్యవహారంలో సంచలనాత్మక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తమిళనాడులోని కోయంబత్తూరులో నేవీ ఉద్యోగి ప్రదీప్ ముఖర్జీ (31) అరెస్టుతో ప్రారంభమైన ఈ దర్యాప్తులో.. ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం చేపట్టిన 'ఆపరేషన్ ఫైర్‌వాల్' అంతర్రాష్ట్ర స్పై నెట్‌వర్క్‌ను బట్టబయలు చేసింది.

ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు చెందిన 12 ప్రత్యేక బృందాలు ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక సహా దేశంలోని 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించాయి.

# లోకల్ ఎలక్షన్స్‌పై కూటమి బిగ్ ప్లాన్

- స్థానిక ఎన్నికల్లో కూటమి క్లీన్ స్వీప్ టార్గెట్
- చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కీలక భేటీ
- టీడీపీ, జనసేన మధ్య సమన్వయంపై ఫోకస్
- అభ్యర్థుల ఎంపిక, సీట్ల సర్దుబాటుపై కసరత్తు
- రాష్ట్ర, జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీల యోచన
- క్షేత్రస్థాయి బలానికే సీట్ల కేటాయింపు
- కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలన్న నిర్ణయం

2 లో

# ఎంఎస్ఎంఈలకు కేంద్రం బిగ్ బూస్ట్!

- ఎంఎస్ఎంఈలకు రూ.10 వేల కోట్ల ఫండ్
- చిన్న పరిశ్రమలకు ఈక్విటీ పెట్టుబడులు
- గ్లోబల్ మార్కెట్‌పై ఎంఎస్ఎంఈల ఫోకస్
- రుణభారం తగ్గించేలా మూలధన సాయం
- లాజిస్టిక్స్ అథారిటీకి గ్రీన్‌సిగ్నల్
- రైలు, రోడ్డు, పోర్టుల అనుసంధానం

2 లో

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్



# తాగేవారిపైనే ప్రివిలేజ్ ఫీ భారం!

**మొదటి పేజీ తరువాయి**

హైదరాబాద్ సీటీని అప్ గ్రేడ్ చేశామని అందుకు అనుగుణంగానే బార్ లైసెన్స్ లు ఇచ్చామన్నారు. ఇతర రాష్ట్రాలలో ఉన్న విధంగానే బార్ లకు పర్మిషన్ ఇచ్చినట్లు వెల్లడించారు. మద్యం తాగడం తగ్గాలని గతంలో రేట్లు పెంచాం... అయినా పెద్దగా మార్పేమి లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో 260 శాతం మద్యం అమ్మకాలు పెరిగాయని కేసీఆర్ హయాంలో మద్యం ఆదాయం రూ.10 వేల కోట్ల నుంచి రూ.36 వేల కోట్లకు పెరిగిందన్నారు. ప్రస్తుతం రూ.40 వేల కోట్ల ఆదాయం వస్తోందని మేము వచ్చాక రూ.4వేల కోట్ల ఆదాయం మాత్రమే పెరిగిందన్నారు. లిక్కర్ ఉత్పత్తికి నీటి కొరత రాదన్నారు.

**కేసీఆర్ ను అడగమని కేటీఆర్ చెబితే నేను అడగలేదు:**

మేము చట్టబద్దంగా ముందుకు వెళ్తున్నామని ఊరికేనె అరెస్టులు చేయబోమన్నారు. కేసీఆర్ భూములపై వేసిన కమిటీ ఎంక్వరీ జరుగుతోందని త్వరలో అన్ని బయటపెడుతామన్నారు. మంత్రులు ఎలాంటి గందరగోళంలో లేరని గందరగోళం కావాలనుకునే వారు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు మాదేనని అభ్యర్థుల ప్రకటన తోనే గెలుపు డిసైడ్ అయిందన్నారు. కంటోన్మెంట్, ఖైరతాబాద్ తరహాలో ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లోనూ గెలుస్తామని దీంట్లో వింత ఏమీ లేదన్నారు. నేను అందరిలా ఎప్పుడు పడితే అప్పుడు మీడియాతొ మాట్లాడనని నా అవసరం ఉంది అనుకుంటే మాట్లాడుతానన్నారు. నేను మహబూబ్ నగర్ జైల్లో ఉంటే నన్ను పరామర్శించడానికి వైఎస్సార్ వచ్చారని ఆ సందర్భంలో తెలంగాణలో మోటార్లపై రైతులు ఆధార పడ్డారు.. ఫ్రీ కరెంట్ ఇవ్వాలని వైఎస్సార్ ను నేను కోరినట్లు చెప్పారు. వైఎస్సార్ ను చాలా అభిమానిస్తానని అయినా కొన్ని విషయాలు నేను నిర్మోహ్మాటంగా చెప్పేవాడినన్నారు. 2018లో నేను ఓడిపోయినప్పుడు... కేటీఆర్ నన్ను కలసి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ పదవి ఇవ్వాలని కేసీఆర్ ను అడగమన్నారని కానీ నేను అడగలేదని చెప్పారు. నాకు సెల్ఫ్ రెస్పెక్ట్ ఇంపార్టెంట్ అని అందుకే బీఆర్ఎస్ ను వీడినట్లు చెప్పారు.

# ఏపీపీఎస్సీ గ్రూప్-1కు గ్రీన్ సిగ్నల్!




**న్యూస్ డెస్క్, 06 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నిరుద్యోగ అభ్యర్థులకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ తీపి కబురు అందించింది. రాష్ట్ర పరిపాలనా విభాగాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రూప్-1 సర్వీసుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ను అధికారికంగా విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 13 విభాగాల్లో కలిపి 166 గ్రూప్-1 ఎగ్జిక్యూటివ్, నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు కమిషన్ అధికారిక వెబ్‌సైట్ జూంఎ.ఖజూ.ౖశీజ.ఱఅ ద్వారా అక్టోబర్ 06 నుంచి అక్టోబర్ 27వ తేదీ రాత్రి 11:59 గంటల వరకు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను సమర్పించవచ్చని కమిషన్ స్పష్టం చేసింది.

ఈ నోటిఫికేషన్‌లో ప్రధానంగా డిప్యూటీ కలెక్టర్లు (12), అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్ (14), డీఎస్పీ సివిల్ (36), డీఎస్పీ కమ్యూనికేషన్స్ (3), డీఈవో (14), ఆర్టీవో (3), డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (35), మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2 (12), డిప్యూటీ రిజిస్ట్రార్ (16) వంటి అత్యున్నత హోదా కలిగిన పోస్టులు ఉన్నాయి. పోలీస్ విభాగంలోని డీఎస్పీ పోస్టులకు వయోపరిమితిని 21-30 ఏళ్లుగా నిర్ణయించగా, ఇతర శాఖల్లోని అత్యధిక పోస్టులకు 18 నుంచి 44 ఏళ్ల వరకు అర్హత కల్పించారు. అలాగే పే స్కేల్ నెలకు రూ.54,060 నుంచి గరిష్టంగా రూ.1,54,980 వరకు వర్తించనుంది. రిజర్వేషన్లు, జోన్ల వారీగా పూర్తి ఖాళీల వివరాలను అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ నోటిఫికేషన్‌లో పరిశీలించవచ్చని అధికారులు తెలిపారు.

# పెరగనున్న విద్యుత్ ఛార్జీలు

**మొదటి పేజీ తరువాయి**



డిస్కంలు చేసిన ఈ ప్రతిపాదనలను పరిశీలించిన కమిషన్.. వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్లను మినహాయించి.. మిగిలిన రూ.5,420.23 కోట్లను వ్యవసాయేతర విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు అనుమతించింది.

ఈ ఛార్జీలను ఒకేసారి కాకుండా దశలవారీగా వసూలు చేయనున్నారు. నవంబర్‌లో ఇచ్చే కరెంటు బిల్లులో యూనిట్‌కు 30 పైసల చొప్పున.. ఆ తర్వాత డిసెంబర్ నుంచి ఇచ్చే బిల్లుల్లో యూనిట్‌కు 50 పైసల చొప్పున అదనపు ఛార్జీ విధించనున్నారు. ఈ వసూళ్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) పరిధిలో 29 నెలలు.. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) పరిధిలో 26 నెలల పాటు కొనసాగనున్నాయి.

ట్రూఅప్ ఛార్జీల కింద అనుమతించిన మొత్తంలో దక్షిణ తెలంగాణ డిస్కం వాటా రూ.5,665.42 కోట్లు కాగా.. ఉత్తర తెలంగాణ డిస్కం వాటా రూ.1,969.80 కోట్లుగా ఉంది. అయితే ఈ మొత్తాల్లో వ్యవసాయ రంగానికి సంబంధించిన వాటాను మినహాయించాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని వ్యవసాయేతర కనెక్షన్ల నుంచి నిర్ణీత కాలపరిమితిలో వసూలు చేయనున్నారు. ఈ క్రమంలోనే వ్యవసాయ వినియోగదారులపై అదనపు భారం పడకుండా ఈఆర్‌సీ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది.

వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాబట్టుకోవాలని డిస్కంలకు ఈఆర్‌సీ సూచించింది. ఇందులో దక్షిణ తెలంగాణ డిస్కం పరిధికి రూ.1,442.49 కోట్లు.. ఉత్తర తెలంగాణ డిస్కం పరిధికి రూ.772.50 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత వ్యవసాయ విద్యుత్ విధానాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల నుంచి నేరుగా ఈ ఛార్జీలు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది.

ట్రాఫిక్ చలానాలపై సుప్రీం ఆదేశాలు..ఇకపై ఇళ్లకు కరెంట్ కట్

ట్రూఅప్ ఛార్జీల వసూలుపై ఈఆర్‌సీ కొన్ని నిబంధనలను కూడా విధించింది. ప్రతి నెలా జారీ చేసే విద్యుత్ బిల్లులో ఈ ఛార్జీలను ప్రత్యేక అంశంగా చూపించాలని తేల్చి చెప్పింది. ఏ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలను వసూలు చేస్తున్నారో.. వినియోగానికి వర్తించే యూనిట్ రేటు ఎంత, లెక్కింపు ఎలా చేశారో వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయాలని తెలిపింది. సాధారణ విద్యుత్ ఛార్జీలతో కలిపి చూపకుండా.. ట్రూఅప్ మొత్తాన్ని విడిగా పేర్కొనాలని ఆదేశించింది.

ట్రూఅప్ ఛార్జీలు అంటే ఏంటి?

ప్రతి ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ కొనుగోలు వ్యయం, ఆదాయం వంటి అంశాలపై డిస్కంలు.. ఈఆర్‌సీకి అంచనాలను సమర్పిస్తాయి. వాటిని ఈఆర్‌సీ పరిశీలించి టారిఫ్‌కు సంబంధించిన నిర్ణయాలను తీసుకుంటుంది. అయితే.. నిజానికి విద్యుత్ కొనుగోలుకు అంచనాల కంటే ఎక్కువ ఖర్చు కావడం లేదా వినియోగదారుల నుంచి వచ్చే ఆదాయం అంచనాల కంటే తగ్గడం వంటి పరిస్థితులు ఏర్పడతాయి. ఈ వ్యత్యాసాలను తర్వాత సర్దుబాటు చేసి వసూలు చేసే మొత్తాలనే ట్రూఅప్ ఛార్జీలు అంటారు.

ప్రస్తుత నిర్ణయం ప్రకారం 2022-23 విద్యుత్ కొనుగోలుకు అదనంగా అయిన రూ.5,186.29 కోట్ల వ్యయాన్ని.. 2023-24లో నమోదైన రూ.2,448.93 కోట్ల ఆదాయ లోటును కలిపి మొత్తం రూ.7,635.22 కోట్లను లెక్కించారు. ఇందులో వ్యవసాయ రంగానికి సంబంధించిన మొత్తాన్ని ప్రభుత్వం భరించాల్సి ఉండగా.. మిగిలిన రూ.5,420.23 కోట్లను వ్యవసాయేతర వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారు. ఈ నిర్ణయంతో సాధారణ గృహాలు, వ్యాపార సంస్థలు, ఇతర వ్యవసాయేతర విద్యుత్ కనెక్షన్ల వినియోగదారుల నెలవారీ బిల్లులు పెరిగే అవకాశం ఉంది.

# ఎంఎస్ఎంఈలకు కేంద్రం బిగ్ బూస్ట్!




**న్యూస్ డెస్క్, 06 అక్టోబర్ (బిఎన్ఎస్):** దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయాలు తీసుకుంది. చిన్న, మధ్యతరహా పరిశ్రమల వృద్ధికి భారీ ఊతమిస్తూ ఏకంగా రూ.10,000 కోట్ల ఎంఎస్ఎంఈ గ్రోత్ ఫండ్ కు ఆమోదం తెలిపింది. అదేవిధంగా రవాణా రంగాన్ని సమూలంగా మార్చేందుకు ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ లాజిస్టిక్స్ అథారిటీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

రూ.10,000 కోట్ల ఫండ్‌కు ఆమోదం..

చిన్న, మధ్యతరహా పరిశ్రమల వృద్ధిని వేగవంతం చేయడానికి, వాటికి ప్రత్యక్ష ఈక్విటీ పెట్టుబడులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.10,000 కోట్ల నిధిని కేటాయించింది. చిన్న వ్యాపారాలుగా ఉన్న సంస్థలు ఉన్నత స్థాయికి ఎదగడానికి, గ్లోబల్ మార్కెట్‌లో ఇతర దేశాల కంపెనీలతో దీటుగా పోటీ పడేందుకు ఈ ఫండ్ ఎంతగానో దోహదపడుతుంది. తాజా నిధులలో ఎక్కువ భాగం చిన్న, మధ్యతరహా తయారీ రంగాలకు, అలాగే ఇతర పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు కేటాయించనున్నారు. కేవలం స్వల్పకాలిక రుణాలకే పరిమితం కాకుండా, ఈక్విటీ రూపంలో మూలధన సహాయం అందించడం ద్వారా చిన్న వ్యాపారాలపై ఉన్న రుణ భారాన్ని గణనీయంగా తగ్గించనున్నారు.

ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ లాజిస్టిక్స్ అథారిటీ ..

దేశంలో రవాణా, లాజిస్టిక్ రంగాల సమగ్ర అభివృద్ధి, పరిశోధన అలాగే వివిధ రవాణా మార్గాల అనుసంధానానికి నేషనల్ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు కేంద్రం ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ లాజిస్టిక్స్ అథారిటీ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ అథారిటీ ద్వారా రైల్వేలు, రోడ్లు, పోర్టులు, విమానయాన రంగాలు మరింత మెరుగైన పద్ధతిలో అనుసంధానం కానున్నాయి. దేశవ్యాప్తంగా చేపడుతున్న భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల ప్రణాళిక, వాటి అమలును పర్యవేక్షించడంలో ఈ అథారిటీ అత్యంత కీలక పాత్ర పోషించనుంది.

# ఏపీలో పాక్ స్పై నెట్‌వర్క్!

**మొదటి పేజీ తరువాయి**

ఈ సోదాల్లో మొత్తం 18 మందితో కూడిన పాకిస్థాన్ గూఢచర్య నెట్‌వర్క్ పనిచేస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీరిలో 13 మంది నావికాదళ సిబ్బందిని అనుమానితులుగా తేల్చారు.

ఎన్‌క్రిప్టెడ్ ఛానళ్ల ద్వారా సమాచారం లీక్

భారత నావికాదళం, వివిధ రక్షణ సంస్థల సమాచారమే లక్ష్యంగా ఈ గూఢచర్యం సాగినట్లు అధికారులు స్పష్టం చేశారు. అనుమానితులంతా అత్యంత రక్షణ కలిగిన 'ఎన్‌క్రిప్టెడ్ ఛానళ్ల' ద్వారా సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్ ఏజెంట్లకు చేరవేస్తున్నట్లు విచారణలో తేలింది. తనిఖీల సందర్భంగా అనుమానితుల నుంచి పెద్దెత్తున ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

డ్రైవర్ సాయి వరప్రసాద్‌కు రిమాండ్

ఈ మొత్తం నెట్‌వర్క్‌లోని 18 మందిలో ఇద్దరి ప్రమేయంపై పక్కా ఆధారాలు లభించినట్లు సమాచారం. ఈ కేసులో కీలక అనుమానితుడైన కాంట్రాక్ట్ డ్రైవర్ సాయి వరప్రసాద్‌ను ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు అతడికి ఈ నెల 14 వరకు రిమాండ్ విధించడంతో విశాఖపట్నం జిల్లా జైలుకు తరలించారు. మరోవైపు కోయంబత్తూరులో అదుపులోకి తీసుకున్న నేవీ ఉద్యోగి ప్రదీప్ ముఖర్జీని సుదీర్ఘంగా విచారిస్తున్నారు. మిగిలిన 16 మంది అనుమానితుల పాత్రపై కౌంటర్ ఇంటెలిజెన్స్, జాతీయ పరిశోధన సంస్థల అధికారులు దర్యాప్తును మరింత వేగవంతం చేశారు.

# రాహుల్ గాంధీ ఆరోపణలు అవాస్తవం




**న్యూస్ డెస్క్, 06 అక్టోబర్ (బిఎన్ఎస్):** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి ఫ్యాక్ట్‌చెక్‌లో స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి మేలు చేసేందుకు చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా ఓటర్ల నమోదు దరఖాస్తు 'ఫామ్-6'లో నిబంధనలను మార్చారంటూ రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించారు. అయితే ఈ పోస్ట్‌ను తోసిపుచ్చిన సీఈవో యంత్రాంగం, ఫామ్-6 డిక్లరేషన్‌కు సంబంధించి ఎన్నికల సంఘం తీసుకున్న ప్రతి నిర్ణయం కమిషన్ పూర్తి ఆమోదంతో పాటు సుప్రీంకోర్టు ఉత్తర్వులకు లోబడే జరిగిందని అధికారికంగా వెల్లడించింది.

బిహార్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ఎన్నికల సంఘం సభ్యులందరి ఏకగ్రీవ ఆమోదంతోనే అమలు చేశామని, ఈ ఉత్తర్వులను సుప్రీం కోర్టు తన 2026 మే 27 నాటి తీర్పులో సమర్థించిందని ఫ్యాక్ట్‌చెక్‌లో వివరించారు. అంతేకాకుండా, ఈసీఐ 2026 సెప్టెంబర్ 26న విడుదల చేసిన ప్రెస్ నోట్ (నం. 120)లోని పాయింట్ 1(iii)లో కూడా.. "ఎస్ఐఆర్ కోసం ఫామ్-6తో జతపరిచిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించింది" అని స్పష్టంగా పేర్కొన్నట్లు రుజువులను ఉటంకించారు. రాజ్యాంగబద్ధ సంస్థల నిర్ణయాలపై ఆధారాలు లేని రాజకీయ ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదని ఈ సందర్భంగా తెలంగాణ ఎన్నికల ఎన్నికల సంఘం అధికారులు స్పష్టం చేశారు.

# మళ్లీ వణుకుపుట్టిస్తున్న 'బర్డ్ ఫ్లూ'

**మొదటి పేజీ తరువాయి**



ఈ మరణాలు క్రమంగా మొత్తం మందకు వ్యాపించాయి.

భోపాల్ ల్యాబ్‌లో బర్డ్ ఫ్లూ నిర్ధారణ..

ఇంత పెద్ద సంఖ్యలు ఒకేసారి కోళ్లు మృతి చెందడంతో ఆందోళన చెందిన నిర్వాహకులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో పశుసంవర్ధక శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి మృతి చెందిన కోళ్ల నమూనాలను సేకరించారు. వాటిని భోపాల్ లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెసెస్ కు పరీక్షల నిమిత్తం పంపగా.. తాజాగా వచ్చిన నివేదికలో బర్డ్ ఫ్లూ ఉన్నట్లుగా తేలింది.

కంటైన్మెంట్ చర్యలు..

ఇక బర్డ్ ఫ్లూ నిర్ధారణ కావడంతో పశుసంవర్ధక, వైద్య, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సంయుక్తంగా సిద్ధరాంపురం గ్రామాన్ని సందర్శించి కంటైన్మెంట్ చర్యలు చేపట్టారు. బర్డ్ ఫ్లూ ప్రభావిత ఫారమ్‌ను, సజీవంగా ఉన్న మిగతా కోళ్లను అధికారులు క్వారంటైన్‌లో ఉంచారు. గుడ్లు, కోళ్ల ఎరువు, సైలేజ్, నేల, వైరస్ సోకడానికి అవకాశం ఉన్న ఇతర వస్తువులను పూర్తిగా వేరు చేసి భద్రపరిచారు. ఫారమ్ చుట్టూ 10 కి.మీ పరిధిలో నివారణ, నిఘా చర్యలు చేపట్టారు. వైరస్ మరింత వ్యాపించకుండా చనిపోయిన పక్షులను సురక్షితంగా ఖననం చేయడం, దహనం చేస్తున్నారు.

3 నెలల పాటు రవాణా ఆంక్షలు

పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ.. గ్రామంలోకి, గ్రామ బయటకు కోళ్లు, గుడ్ల రవాణాపై రానున్న 3 నెలల పాటు కఠిన ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఈ నిబంధనలను పక్కాగా అమలు చేసేందుకు గ్రామంలో పోలీసులను మోహరించారు. స్థానిక ప్రజలు ఎవరికైనా జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అలాగే పౌల్ట్రీ ఉత్పత్తుల నిర్వహణ, వినియోగంలో తప్పనిసరిగా ఆరోగ్య, పశువైద్య శాఖల సలహాలు పాటించాలని హెచ్చరించారు. గతంలో 2025 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ వెలుగుచూసిన విషయం తెలిసిందే.

# లోకల్ ఎలక్షన్స్‌పై కూటమి బిగ్ ప్లాన్

**న్యూస్ డెస్క్, 06 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి కూటమి పార్టీల అధినేతలు వ్యూహాలకు పదును పెట్టారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అత్యంత కీలకమైన సమీక్షా సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన ఘన విజయాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో పునరావృతం చేస్తూ, క్షేత్రస్థాయిలో కూటమి వంద శాతం విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఇరువురు నేతలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఎన్నికల నిర్వహణ, అభ్యర్థుల ఎంపిక, సీట్ల సర్దుబాటు ప్రక్రియలో ఎక్కడా విభేదాలకు తావులేకుండా టీడీపీ, జనసేన శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలని స్పష్టం చేశారు. కూటమిలోని ఐక్యత విషయంలో అటు పార్టీ నాయకులకు, ఇటు క్షేత్రస్థాయి కార్యకర్తలకు అత్యంత స్పష్టమైన సందేశం పంపాలని ఇరు పార్టీల అధినేతలు తీర్మానించారు.

ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో రెండు పార్టీల మధ్య పూర్తి సమన్వయం కోసం ఒక ప్రత్యేక వ్యవస్థను, రాష్ట్ర-జిల్లా స్థాయి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలని యోచించారు. స్థానిక సంస్థల సీట్ల పంపకంలో పార్టీల క్షేత్రస్థాయి బలాబలాలకు పెద్దపీట వేయాలని, ఏ ప్రాంతంలో ఏ మిత్రపక్షాలకు పట్టు, బలం ఉంటే అక్కడ ఆ పార్టీకే పోటీ చేసే అవకాశం కల్పించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు సూత్రప్రాయంగా అంగీకరించారు. మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల కేటాయింపుపై ప్రాథమికంగా కసరత్తు చేసిన నేతలు.. పరస్పర సహకారంతో క్లీన్ స్వీప్ చేయడమే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. స్థానిక సంస్థల సమరానికి ఇరు పార్టీల సమన్వయ కార్యాచరణను ఖరారు చేస్తూ ఈ సమీక్షా సమావేశం ముగిసింది.

# గోషామహల్ ఓట్లపై ఒవైసీ ఫిర్యాదు!

**మొదటి పేజీ తరువాయి**

హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ముందస్తుగా ముద్రించిన ఫారం-7 దరఖాస్తులను ఉపయోగించి ఓట్ల తొలగింపునకు యత్నించిన ఘటనపై ఎన్నికల సంఘం తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

ఫారం-7 దరఖాస్తుల దుర్వినియోగం..

గోషామహల్ నియోజకవర్గంలో ఎలాంటి పరిశీలన లేకుండా, ముందస్తుగా ముద్రించిన ఫారం-7 దరఖాస్తులను పెద్ద ఎత్తున సమర్పించి ముస్లిం ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఒవైసీ ఆరోపించారు. ఈ భారీ కుట్ర వెనుక ఒక బీజేపీ సానుభూతిపరుడి హస్తం ఉందని, కేవలం ఒక్క నియోజకవర్గంలోనే దాదాపు 122 మంది ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఈ దరఖాస్తులు సమర్పించారని ఆయన మండిపడ్డారు. ఈ ఘటనపై కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి, ఈ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఒవైసీ కోరారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లను అక్రమంగా తొలగించే ఈ తరహా ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తాయని, ఈ అంశంపై అధికారులు కఠిన నిఘా ఉంచాలని అసదుద్దీన్ ఒవైసీ సూచించారు.

# మీజిల్స్ విజృంభణ.. న్యూయార్క్ అలర్ట్!

**న్యూస్ డెస్క్, 06 అక్టోబర్ (బిఎన్ఎస్):** అమెరికాలోని న్యూయార్క్ నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా తట్టు (మీజిల్స్) వ్యాధి కేసులు మళ్లీ ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. దీంతో న్యూయార్క్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజారోగ్య భద్రత దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా 'డిజాస్టర్ హెల్త్ ఎమర్జెన్సీ' విధిస్తున్నట్లు గవర్నర్ కాథీ హోచుల్ అధికారిక ఉత్తర్వులు (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 65) జారీ చేశారు. ఈ అత్యవసర పరిస్థితి తక్షణమే అమల్లోకి వచ్చి నవంబర్ 4 వరకు కొనసాగనుంది. ఒకప్పుడు పూర్తిగా కనుమరుగైందనుకున్న ఈ అంటువ్యాధి, ముఖ్యంగా వ్యాక్సినేషన్ శాతం తక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాలు, కమ్యూనిటీలలో పిల్లలు, పెద్దల్లో వేగంగా వ్యాపిస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

ఎమర్జెన్సీ ప్రకటనతో వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఎంఎంఆర్ ( తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా) టీకాలను అందించేందుకు నర్సులు, ఫార్మసిస్టులు, పారామెడికల్ సిబ్బందితో సహా ఇతర ఆరోగ్య కార్యకర్తలకు తాత్కాలికంగా విస్తృత అధికారాలు కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా పిల్లలకు తక్షణమే టీకాలు వేయించేలా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే ప్రజలు వైద్యులను సంప్రదించాలని, తప్పుడు సమాచారాన్ని నమ్మకుండా వ్యాక్సిన్లు తీసుకోవాలని ఆరోగ్య శాఖ కమిషనర్ డాక్టర్ జేమ్స్ మెక్‌డొనాల్డ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సీఎం మాటలు.. సిరిసిల్ల మూటలు?

**మొదటి పేజీ తరువాయి**

వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాలకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు నీటి బొట్టు కూడా రాలేదని ఆమె విమర్శించారు. గత ప్రభుత్వంలో మంత్రి హరీశ్‌రావు చెప్పిన ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని కోరారు. రుద్రంగి వద్ద రూ.200 కోట్లతో 2.5 టీఎంసీల రిజర్వాయర్ నిర్మిస్తామని గతంలో చెప్పారని, ఆ హామీ ఏమైందని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఈ ప్రాంత రైతులకు ప్రయోజనం కలగడం లేదని అన్నారు. రైతుల కోసం మంత్రి బండి సంజయ్, ఆది శ్రీనివాస్ తమ పలుకుబడిని ఉపయోగించి రుద్రంగి, ధూంపేట తదితర ప్రాంతాల్లోని చెరువులకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులకు నిరంతర విద్యుత్ అందించాలని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్‌ను కొనుగోలు చేస్తుందో, అడుక్కుంటుందో తమకు తెలియదని, కానీ రైతులకు మాత్రం కరెంట్ అందాల్సిందేనని అన్నారు. ప్రజా సమస్యలపై టీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. సిరిసిల్లకు ముఖ్యమంత్రి ఏదో ఒక భారీ ప్రకటన చేస్తారని భావించినప్పటికీ, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని కవిత విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు అభివృద్ధికి సంబంధించి ఎలాంటి కీలక ప్రకటన చేయలేదన్నారు. సిరిసిల్లలో గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని గతంలో చెప్పారని, అయితే ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉందని వ్యాఖ్యానించారు.

సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయాలు చేయడం తప్ప అభివృద్ధి చేయడం తెలియదని కవిత విమర్శించారు. రైల్వే లైన్ పనులు కూడా అక్కడక్కడ నిలిచిపోయాయని, వాటిని పూర్తి చేయాలని టీఆర్ఎస్ తరఫున పోరాటం చేస్తామని తెలిపారు. గల్ఫ్ కార్మికులకు అన్యాయం జరుగుతోందని, గల్ఫ్ అడ్వైజరీ కమిటీ నుంచి సభ్యులు తప్పుకుంటున్నారని అన్నారు. సిరిసిల్ల జేఎన్‌టీయూ విద్యార్థులు ల్యాబ్ సౌకర్యాల కోసం జగిత్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని కవిత పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలోనూ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎమ్మెల్యే కేటీఆర్, ఆది శ్రీనివాస్, బండి సంజయ్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ (సెస్)కు దేశంలోనే ప్రత్యేక చరిత్ర ఉందని కవిత అన్నారు. సెస్‌ను ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేసిన తర్వాత విద్యుత్ పోల్ దెబ్బతిన్నా పట్టించుకునే వారు లేకుండా పోయారని ఆరోపించారు. సెస్‌లో గతంలో అవినీతి జరిగిందని, ఫైర్ ప్రమాదంలో కీలక ఫైల్స్ కాలిపోయాయని ఆమె వ్యాఖ్యానించారు. నేరెళ్ల బాధితుల ఫైల్స్ కూడా కాలిపోయాయని కవిత ఆరోపించారు. సీఎం సిరిసిల్ల సభలో నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా టీఆర్ఎస్ పార్టీ తరఫున అండగా ఉంటామని తెలిపారు.

కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యల మధ్య పొంతన లేదని కవిత విమర్శించారు. రేవంత్‌రెడ్డి పదేళ్లు తానే సీఎంగా ఉంటానని చెబుతుంటే, మరోవైపు బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని పార్టీ నేతలు చెబుతున్నారని అన్నారు. ఈ పరిణామాలను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్ మధ్య "విడాకులు అయ్యాయి" అంటూ కవిత వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పాలనలో జర్నలిస్టులకు కూడా అన్యాయం జరుగుతోందని కవిత ఆరోపించారు. ముఖ్యంగా ముస్లిం జర్నలిస్టులకు అక్రిడిటేషన్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వ్యాఖ్యానించారు.

మాజీ మావోయిస్టులు టీఆర్ఎస్ పార్టీలోకి రావాలని కవిత పిలుపునిచ్చారు. వారిని పార్టీలోకి స్వాగతిస్తామని, మావోయిస్టుల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కవిత అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తెలిపారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ విద్యా రంగంపై నియంత్రణ తీసుకొస్తామని, ప్రస్తుతం ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇంకా ముంపు గ్రామాల సమస్యలపైనా పోరాటం చేస్తామని కవిత అన్నారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

# తారానగర్ రోడ్డు విస్తరణపై కీలక నిర్ణయం!

**100 అడుగుల నుంచి 80 అడుగులకు కుదింపు..**

**ఫ్లైఓవర్ వెడల్పు కూడా తగ్గించాలని వినతి**

**కమిషనర్ సృజన ఐఏఎస్ కు వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**



శేరిలింగంపల్లి, అక్టోబర్ 6: శేరిలింగంపల్లి డివిజన్‌లో అసంపూర్తిగా ఉన్న సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరుతూ శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మంగళవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన ఐఏఎస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ప్రధాన సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు.

తారానగర్ ప్రధాన రహదారి విస్తరణలో చిరు వ్యాపారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 100 అడుగుల నుంచి 80 అడుగులకు రోడ్డు వెడల్పును కుదించినందుకు కమిషనర్ సృజనకు కార్పొరేటర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా గుల్మోహర్ పార్క్ నుంచి విద్యానికేతన్ మోడల్ స్కూల్ వరకు చేపట్టనున్న ఫ్లైఓవర్ నిర్మాణాన్ని 120 అడుగుల నుంచి 100 అడుగులకు కుదించాలని కమిషనర్‌ను కోరారు. దీనిపై సృజన



ఐఏఎస్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు.

**కమిషనర్‌కు బతుకమ్మ ఆహ్వానం**

అనంతరం శేరిలింగంపల్లి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.ఆర్. పవన్ కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు ఈ నెల 10న నిర్వహించనున్న బతుకమ్మ కార్యక్రమానికి కమిషనర్ సృజన ఐఏఎస్ ను ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షుడు వీరేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తాటిపాకలో ముగ్గురు చిన్నారుల అదృశ్యం....

**ఆరవ తరగతి విద్యార్థితో కలిసి వెళ్లిన ఇద్దరు చిన్నారులు...**

**తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన...**





రాజోలు (బిఎన్ఎస్)అక్టోబర్ 6: కోనసీమ జిల్లా రాజోలు మండలంలోని తాటిపాక గ్రామంలో ముగ్గురు చిన్నారులు అదృశ్యమైన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. గ్రామానికి చెందిన ఆరవ తరగతి విద్యార్థి ముసుకుడి కార్తీక్ సమీప నివాసంలో ఉంటున్న ముత్యాల నరసింహస్వామి, ముత్యాల లక్ష్మీదుర్గ దంపతుల పిల్లలు ఏడేళ్ల ముత్యాల సాయిరాం, ఐదేళ్ల ముత్యాల అంజి ప్రభులను తనతో తీసుకుని వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు కనిపించకుండా పోవడంతో వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఒకే ప్రాంతానికి చెందిన ముగ్గురు చిన్నారులు అదృశ్యం కావడంతో గ్రామంలో ఆందోళన నెలకొంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. చిన్నారుల ఆచూకీ కోసం రాజోలు ఎస్సై మల్లికార్జున్ రెడ్డి మూడు పోలీసు బృందాలతో గాలింపు చేపట్టినట్లు తెలిపారు . చిన్నారులు ఎక్కడికి వెళ్లారు, ఏ పరిస్థితుల్లో వెళ్లారు అనే విషయాలపై దర్యాప్తు కొనసాగుతోంది. చిన్నారుల ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు త్వరగా స్పందించి చిన్నారులను సురక్షితంగా గుర్తించాలని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు...

# ప్రజా సమస్యలపై డీఆర్ఓకు కడప వైఎస్సార్‌సీపీ వినతి...!!

**వైయస్సార్సీపి కడపజిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, అంజాద్ భాష, నాయకుల ఆధ్వర్యంలో వినతి..**

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 06: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు, ఎన్నికలలో ప్రత్యక్ష పోటీ చేయనున్న అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కడప కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ ను కలిసి ప్రజలు, అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు, పోటీ చేయనున్న అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలను కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఓటర్ల జాబితా, డివిజన్లు, వార్డుల వర్గీకరణలో కార్పొరేషన్ అధికారుల ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారని, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, అంజాద్ బాషాలు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై న్యాయపోరాటం చేస్తాం అన్నారు. కుల ధృవీకరణ పత్రాల జారీలో ప్రజలకు, అభ్యర్థులకు ఇబ్బందులను కలగజేస్తూ.. తీవ్ర జాప్యం చేస్తున్నారన్నారు. జిల్లాలోని నగర కార్పొరేషన్ మరియు మిగిలిన నియోజకవర్గాల లోని మున్సిపాలిటీల్లో నో-డ్యూస్ సర్టిఫికెట్లు అందక ప్రజల అవస్థలు పడుతున్నారన్నారు. సచివాలయాలు, మీ-సేవ, ఎంఆర్ఓ, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలకు అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ స్పందించడం లేదన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు 'రెడ్ బుక్ రాజ్యాంగం' నడుస్తుందన్నారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి కడప వైఎస్సార్‌సీపీ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ప్రజలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, పారదర్శకమైన ఎన్నికల ప్రక్రియ అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని



కోరారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి వైఎస్ఆర్సిపి కడప నాయకులు కోరారు.

# డ్రగ్స్ వద్దు బ్రో




మమ్మిడివరం (బిఎన్ఎస్ )అక్టోబర్ 6: కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ముమ్మిడివరం గ్రామంలో ఉషా ఐ.టి.ఐ కళాశాలలో ఈగల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గంజాయి సమాచారం పై మౌనం వీడాలని ఏదయినా సమాచారం ఉంటే 1972 టోల్ ఫ్రీ నంబర్ కు రిపోర్ట్ చేయాలని మరియు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా వుండాలి అని విద్యపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు చెడు వ్యసనలు ఉన్న వారికీ దూరం గా ఉండలి అని, చెడు వ్యసనాలు ఉన్నవారితో స్నేహం చేస్తే వారితోపాటు మనజీవితాలు కూడా నాశనం అయ్యి ప్రమాదం ఉంది అని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ -- 1972కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అదేవిధంగా సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పిస్తూ, అపరిచితుల లింకులు, కాల్స్, సందేశాలను నమ్మవద్దని, అపరిచిత వ్యక్తులతో వీడియో కాల్స్ మాట్లాడకూడదు అని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు, అత్యవసర పరిస్థితుల్లో 112కు సంప్రదించాలని సూచించారు. ఎండిపిఎస్ చట్టాలపైన, సైబర్ చట్టాలు పైన అవగాహన కలిగి వుండాలి అని సూచించారు. టీచర్స్ కి ప్రతి విద్యార్థిని జాగ్రత్తగా గమనిస్తూ వుండాలి అని ఎవరైనా గంజాయి ఇతర డ్రగ్స్ కి అలవాటు పడితే ఆ విషయమని పేరెంట్స్ కి, ఈగల్ సిబ్బందికి తెలియ జెస్తే అలాంటి వాళ్ళకి డి అడిక్షన్ సెంటర్ వారితో కౌన్సలింగ్ నిర్వహించి డిఅడిక్షన్ సెంటర్స్ లో జాయిన్ చేయంచి ట్రీట్మెంట్ చేయంచడం జరుగుతుంది అని సూచించినారు.

ఈ కార్యక్రమంలో ఈగల్ సిబ్బంది కె . సత్యనారాయణ గారు, ఎం . రఘు కిరణ్ గారు, ఏరియా గవర్నమెంట్ హాస్పిటల్ సైకియాట్రిక్ కౌన్సిలర్ సీహెచ్. బాబీ గారు,కళాశాల ప్రిన్సిపాల్ మట్ట మనోజ్ గారు , అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖ లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలి..!

**దళిత ప్రజా సంఘాల, మాల,మహానాడు నాయకులు పాలాజి వెంకటస్వామి, బిర్రు చెన్నయ్య డిమాండ్...**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 06: ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యం శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని, దళిత ప్రజా సంఘాల, మాల,మహానాడు నాయకులు పాలాజి వెంకటస్వామి, బిర్రు చెన్నయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్యం శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు తమ డిమాండ్స్ తక్షణమే పరిష్కారించాలని మంగళవారం ఆందోళనకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా కడపజిల్లా... జమ్మలమడుగు పట్టణంలోని స్థానిక ప్రభుత్వం ఆసుపత్రి ఆవరణంలో కాంట్రాక్టు మహిళ నర్సింగ్ సిబ్బంది, ఉద్యోగులు, ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఆందోళన చేపడుతున్న మహిళలకు పాలాజి వెంకటస్వామి, బిర్రు చెన్నయ్యలు మద్దతు ప్రకటించారు. అనంతరం వెంకటస్వామి మీడియాతో మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యశాఖ లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు మహిళ నర్సింగ్ సిబ్బంది, గత ఇరవై సంవత్సరాల నుండి వైద్య సేవలు అందిస్తున్నప్పటికి వారిని ప్రస్తుత ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగులుగా చేయక పోవడం చాల బాధకరం అన్నారు. వారి న్యాయమై డిమాండ్లు పరిష్కరించాలని ఈ సందర్భంగా వెంకటస్వామి మీడియా ద్వారా న్యాయపర మైనటువంటి డిమాండ్లను త్వరగతిన పరిష్కరించాలని కాంట్రాక్ట్ బేసిక్ పద్ధతిలో నర్సులుగా పనిచేస్తున్న మహిళ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు.. ఆరోగ్యశాఖ లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు నూరు శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలన్నారు. పిఫ్ లాంటి తది,తర న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఈ కార్యక్రమంలో మాల, మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ రఫిక్ భాషకు కాంట్రాక్టు మహిళ నర్సింగ్ సిబ్బంది, ఉద్యోగులతో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

# దూ్యటీకి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి అదృశ్యం

**చందనగర్‌లో ప్రైవేట్ ఉద్యోగి ఆచూకీ కోసం పోలీసుల గాలింపు**

**సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు**



చందనగర్: డ్యూటీకి వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యమైన ఘటన చందనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పద్మాజ్ కాలనీకి చెందిన దేవులపల్లి రామకృష్ణారెడ్డి (34) ఈ నెల 28న ఉదయం 8 గంటలకు విధులకు వెళు న్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అనంతరం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.

బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆయన ఆచూకీ లభించలేదు. మొబైల్ ఫోన్లు కూడా స్విచ్ఆఫ్‌లో ఉండటంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు చందనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ఇలా ఉంటే గుర్తించండి**

గల్లంతైన రామకృష్ణారెడ్డి తెలుపు రంగు, సుమారు 5.4 అడుగుల ఎత్తు, గుండ్రని ముఖంతో ఉంటారు. అదృశ్యమైన సమయంలో తెల్లటి షర్ట్, నీలం రంగు జీన్స్ ధరించి ఉన్నారు.

సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ, ఇతర సాంకేతిక ఆధారాల ఆధారంగా ఆయన ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. రామకృష్ణారెడ్డి గురించి సమాచారం తెలిసిన వారు 9959813100, 7075584454 నంబర్లకు లేదా సమీపంలోని చందనగర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# కొత్తపేట ఏనుగుల మహల్ గ్రామంలో బిజెపి అంగన్వాడీ ఉత్సవ్



కొత్తపేట (బిఎన్ఎస్ )అక్టోబర్ 6 : భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా సేవాసంకల్ప్ అభియాన్ లో భాగంగా కొత్తపేట మండలం ఏనుగులమహల్ గ్రామంలో అంగన్వాడీ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ పాలూరి సత్యానందం విచ్చేశారు. ముందుగా కార్యకర్తలు నాయకులు అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణీలకు, బాలింతరాళ్లకు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాలూరి మాట్లాడుతూ చిన్నారుల ప్రాథమిక విద్య, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడంతో పాటు చిన్నారులు, తల్లిదండ్రులకు వాటిపై అవగాహన ఉండాలన్నారు.అనంతరం గ్రామ పరిధిలో ఉన్న 3 అంగన్వాడీ కేంద్ర నిర్వాహకులైన టీచర్లకు, ఆయాలకు దుశ్శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కోటిపల్లి సుబ్రహ్మణ్యం, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు అన్యం సత్యనారాయణ, జనసేన నాయకులు మందపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గవర బాబి, మరొక ట్రస్ట్ బోర్డు సభ్యురాలు కోటిపల్లి సుబ్బలక్ష్మి, సేవా సంకల్ప్ అభియాన్ కో కన్వీనర్ కోటిపల్లి దామోదర్,మైనారిటీ మోర్చా మండల అధ్యక్షులు అజ్జరపు సత్యనారాయణ, యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి చోడపనీడి ముఖేష్, నాగరాజు మరియు నాయకులు కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రమంతా వరుణ భగవానుని అనుగ్రహంతో వర్షాలు కురిసి సుభిక్షంగా మారాలి...

**మందేశ్వర స్వామి వారి ఆలయంలో వరుణ యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...**



కొత్తపేట (బిఎన్ఎస్ )అక్టోబర్ 6:మందపల్లి గ్రామంలో నవగ్రహాల్లో అత్యంత శక్తివంతమైన శనైశ్చరస్వామి ప్రతిష్టించిన పవిత్రమైన మందేశ్వర స్వామి వారి సన్నిధిలో వరుణ యాగం, సహస్ర ఘటాభిషేకం నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వరుణయాగంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో దేశమంతా తీవ్రమైన కరువు ఏర్పడిన ప్రస్తుత తరుణంలో అష్టదిక్పాలకుల్లో పశ్చిమ దిక్కుకు అధిపతి అయిన వరుణుడి కరుణ కోరుతూ, వర్షాలు కురవాలని కోరుకుంటూ, పదివేల సార్లు వేద శ్లోకాలు పఠించడం, సహస్ర ఘటాభిషేకం నిర్వహించడం జరిగిందన్నారు. పూర్వకాలంలో వానలు కురవని దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడినప్పుడు రాజులు, ఋషులు వరుణయాగం చేసేవారని, యాగ ఫలితంగా వర్షాలు కురిసేవని తెలిపారు. ఈ వరుణ యాగంతో మన ప్రాంతమంతా వర్షాలు చక్కగా కురవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ యాగంతో తప్పకుండా వరుణదేవుడు అనుగ్రహిస్తాడని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# పుష్పక్ ప్రయాణికులకు భారీ ఊరట

**ఎయిర్‌పోర్ట్ బస్సు ఛార్జీల్లో 40% వరకు తగ్గింపు**
**రేపటి నుంచే కొత్త ఛార్జీలు అమలు**
**మియాపూర్--ఆర్‌జీఐఏ, లింగంపల్లి--ఆర్‌జీఐఏ మార్గాల్లో ప్రయాణికులకు ప్రయోజనం**

హైదరాబాద్, అక్టోబర్ 6: విమానాశ్రయానికి రాకపోకలు సాగించే ప్రయాణికులకు టీజీఎస్‌ఆర్టీసీ శుభవార్త అందించింది. పుష్పక్ గ్రీన్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల ఛార్జీలను 40 శాతం వరకు తగ్గించింది. తగ్గించిన ఛార్జీలు రేపటి (అక్టోబర్ 7) నుంచి అమల్లోకి రానున్నాయి.




నగరం నుంచి రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులతో పాటు, విమానాశ్రయం నుంచి నగరానికి వచ్చే వారికి కూడా తగ్గింపు ఛార్జీలు వర్తించనున్నాయి. పర్యావరణహితమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన పుష్పక్ బస్సు సేవలను మరింత మంది ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఛార్జీలను తగ్గించినట్లు అధికారులు తెలిపారు.

మియాపూర్ ఎక్స్ రోడ్స్ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు

మియాపూర్ ఎక్స్ రోడ్స్: రూ.350 – రూ.250
జేఎన్‌టీయూ: రూ.350 – రూ.200

లింగంపల్లి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు

లింగంపల్లి: రూ.350 – రూ.200
అల్విన్ ఎక్స్ రోడ్స్: రూ.350 – రూ.200
కొండాపూర్: రూ.300 – రూ.200
కొత్తగూడ: రూ.300 – రూ.150
గచ్చిబౌలి: రూ.300 – రూ.150
శిల్పారామం: రూ.300 – రూ.200
గచ్చిబౌలి: రూ.300 – రూ.150

ఎయిర్‌పోర్ట్ నుంచి నగరానికి కూడా తగ్గింపు

ఆర్‌జీఐఏ నుంచి మియాపూర్ ఎక్స్ రోడ్స్ వరకు గరిష్ఠ ఛార్జీ రూ.400 నుంచి రూ.350కు, గచ్చిబౌలి వరకు రూ.350 నుంచి రూ.250కు తగ్గింది. లింగంపల్లి మార్గంలోనూ గచ్చిబౌలి, కొత్తగూడ, కొండాపూర్, అల్విన్ ఎక్స్ రోడ్స్ మీదుగా ఛార్జీలను తగ్గించారు.

తగ్గించిన ఛార్జీలతో పుష్పక్ బస్సుల్లో ప్రయాణం మరింత అందుబాటులోకి రానుందని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు తెలిపారు.

---

# ‘సేవ్ డెమోక్రసీ’ పిలుపుతో.. రేపు ‘చలో లోక్‌భవన్’

**ఎన్నికల ఓటర్ల జాబితా సవరణపై అభ్యంతరాలు..**
**సీఈసీ రాజీనామాకు డిమాండ్**
**ఇందిరాగాంధీ విగ్రహం నుంచి భారీ ర్యాలీ**

హైదరాబాద్, అక్టోబర్ 6: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (SIR)పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఈ నెల 8న ‘చలో లోక్‌భవన్ (రాజ్‌భవన్)’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఇండియా కూటమి ప్రకటించిన ‘సేవ్ డెమోక్రసీ’ కార్యక్రమాల్లో భాగంగా ఈ ఆందోళన చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఉదయం 10 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ర్యాలీ ప్రారంభం కానుంది. అక్కడి నుంచి భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తూ లోక్‌భవన్ వైపు వెళ్లనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌తో పాటు ఇండియా కూటమి ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు.

**కూకట్‌పల్లి నుంచి భారీగా తరలిరావాలి**

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

---

# తెలుగు గంగ ఎస్సార్ 1, 2 ప్రాజెక్టులను నీటితో నింపండి..!!

**రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షుడు ఏవి. రమణ డిమాండ్..**

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 06: కడప జిల్లాలో.. అడుగంటి పోయిన తెలుగు గంగ ఎస్సార్ 1, 2 ప్రాజెక్టులను నీటితో నింపి జిల్లా రైతులను, ప్రజలను ఆదుకోవాలని రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షుడు ఏవి. రమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈరోజు కడప జిల్లా... మైదుకూరు లో రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ, మండల, పట్టణ నాయకులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో రమణ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల క్రితం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి పది టీఎంసీల నీటిని విడుదల చేసి కడప జిల్లా తెలుగు గంగ ప్రాజెక్టులను నీటితో నింపి ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామని ప్రకటించి పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేసి రెండు నెలలు కావస్తున్న ఆ నీరు నంద్యాల జిల్లా వరకే పరిమితమై నందున కడప జిల్లాలోని ఎస్సార్ 1, 2 ప్రాజెక్టులు నీరు లేక అడుగంటి పోయాయని, దీనితో ప్రాజెక్టులకు అనుబంధంగా ఉన్న దువ్వూరు, మైదుకూరు మండలాల్లోని చెరువులు కూడా నీరు లేక ఎండి పోయాయన్నారు. దీనితో బోర్లు కూడా నీరు తగ్గి వేసిన పంటలు ఎండి పోతున్నాయని, వెంటనే కూటమి రాష్ట్ర ప్రభుత్వం కలగజేసుకొని కడప జిల్లా లోని తెలుగుగంగ ఎస్సార్ 1, 2, ప్రాజెక్టులను నీటితో నింపి జిల్లా ప్రజలను, రైతులను ఆదుకోవాలని ఏవి.రమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పోతిరెడ్డిపాడు నుంచి రెండు నెలలుగా నీరు తెలుగు గంగా ప్రాజెక్టులకు వస్తున్న ఆ నీరు నంద్యాల జిల్లా వరకే పరిమితమై కడప జిల్లాకు చుక్క నీరు కూడా రావడంలేదని రమణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కడప జిల్లా లోనీ తెలుగు గంగ ఎస్సార్ 1, 2 ప్రాజెక్టులను నీటితో నింపి ఆదుకోకపోతే కడప జిల్లా రైతు సేవా సమితి ఆధ్వర్యంలో ప్రజా సంఘాలతో కలిసి దశల వారి ఆందోళన నిర్వహిస్తామని రమణ తెలియజేశారు. ఈరోజు జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సేవాసమితి మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి సహదేవుడు, సమితి మండల నాయకులు, నరసింహులు, మూలే రామచంద్రారెడ్డి, సమితి పట్టణ నాయకులు కాన గూడూరు రామ్మోహన్, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, సుబ్రహ్మణ్యం, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



---

# బీమాతో కుటుంబానికి ధీమా

**బిఎన్ఎస్ న్యూస్ పాలకుర్తి అక్టోబర్ 06**




అనుకోని ప్రమాదాలు ఎదురైనప్పుడు కుటుంబానికి బీమా ఆర్థిక భరోసా కల్పిస్తుందని పాలకుర్తి సీఐ భరత్ సుమన్ అన్నారు. పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన పొర్ల మల్లయ్య ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఈ నేపథ్యంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ తరఫున మల్లయ్య కుటుంబానికి రూ.6.72 లక్షల బీమా చెక్కును సీఐ భరత్ సుమన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీమా చేసుకోవాలని సూచించారు. అనుకోని ప్రమాదాలు, కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భాల్లో బీమా కుటుంబానికి ఆర్థిక అండగా నిలుస్తుందని తెలిపారు. అనవసర ఖర్చులను తగ్గించుకుని భవిష్యత్ భద్రత కోసం బీమా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వినయ్ గౌడ్, ఏజెంట్ గజ్జి రాజు, సర్పంచ్ చింతకింది అనిత తదితరులు పాల్గొన్నారు.

---

# రాత్రింబవళ్లు శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల కష్టానికి దక్కిన ఫలితమే “స్వచ్ఛ ఆంధ్ర అవార్డు”: మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి..

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 06: “స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర” కార్యక్రమంలో భాగంగా కడప జిల్లా.. జమ్మలమడుగు మండలం.. రాష్ట్ర విప్, బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జిల్లా టిడిపి అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి సొంత గ్రామమైన దేవగుడి గ్రామం జిల్లా స్థాయిలో అత్యుత్తమ పంచాయతీగా ఎంపికైన వేళ... ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గురు మహేంద్ర రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు గురించి తెలియజేశారు. ఈ విజయం పై మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి గ్రామపంచాయతీ ఉద్యోగుల ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. ఊరిని పరిశుభ్రంగా ఉంచడంలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల కష్టానికి దక్కిన ఫలితమే ఈ అవార్డు అని కొనియాడారు. కార్మికుల సేవలను గుర్తించిన నారాయణరెడ్డి వారిని ప్రోత్సహించేందుకు తన సొంత నిధుల నుంచి నగదు బహుమతిని అందించి అభినందించారు. గ్రామ అభివృద్ధికి, పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ఇలాగే సహకరించాలని, దేవగుడి పంచాయతీని మరింత ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



---

# గిరిజన యువతకు పోలీస్ ఉద్యోగాలపై ప్రత్యేక శిక్షణ

**- ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల శిక్షణను పరిశీలించిన ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో**
**- వసతి, భోజనం, ఫిజికల్ శిక్షణలో లోటుపాట్లు లేకుండా చూడాలి**

**బిఎన్ఎస్ ఏటూరునాగారం, అక్టోబర్ 06:**




ఏటూరునాగారంలోని గిరిజన భవనంలో నిర్వహిస్తున్న SI, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, ఏఎస్పి మన్నన్ కలిసి పరిశీలించారు. శిక్షణ పొందుతున్న గిరిజన అభ్యర్థులతో మాట్లాడి వసతి, భోజనం, విద్యా శిక్షణ, ఫిజికల్ ట్రైనింగ్, రోజువారీ కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. వాజేడు, మంగపేట, కన్నాయిగూడెం మండలాలకు చెందిన అభ్యర్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. అభ్యర్థులు క్రమశిక్షణతో శిక్షణను సద్వినియోగం చేసుకుని పోలీస్ ఉద్యోగాల్లో మంచి ఫలితాలు సాధించాలని పీఓ సూచించారు. శిక్షణ కేంద్రంలో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించాలని ఎంపీడీఓ ను ఆదేశించారు. అభ్యర్థుల ఫిజికల్ ట్రైనింగ్ కోసం కొమురం భీమ్ స్టేడియాన్ని వినియోగించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. శిక్షణతో పాటు వసతి, భోజనం, పారిశుధ్యం, శారీరక దారుఢ్యానికి అవసరమైన సౌకర్యాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

---

# ఘనంగా ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ జన్మదిన వేడుకలు

**400 మంది కాంగ్రెస్ శ్రేణులతో పండుగ వాతావరణంలో వేడుకలు**

**బిఎన్ఎస్ న్యూస్ -- మహబూబాబాద్ అక్టోబర్ 06**

మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ జన్మదిన వేడుకలను కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని సుమారు 400 మంది కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో పండుగ వాతావరణంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి హాజరై కేక్ కట్ చేసి ఎమ్మెల్యే మురళి నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ విజయానికి కష్టపడిన ప్రతి కార్యకర్తను కాపాడుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే మురళి నాయక్ ఆయురారోగ్యాలతో ఉండి రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మురళి నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మురళి నాయక్ నాయకత్వంలో మహబూబాబాద్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎమ్మెల్యే గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను గుర్తించి వారికి అండగా నిలవాలని కోరారు. పార్టీని, ఎమ్మెల్యేను నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తల సంక్షేమానికి భవిష్యత్తులోనూ ప్రాధాన్యత ఇవ్వాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దస్రు నాయక్, టౌన్ పార్టీ అధ్యక్షులు రావుల మురళి, అల్లం నాగేశ్వర్ రావు, అంబటి మహేందర్ రెడ్డి, వీరేష్ యాదవ్, ఆయూబ్ ఖాన్, బండారు వెంకన్న, కదిరే సురేందర్, బండారు దయాకర్, దామరకొండ ప్రవీణ్, బానోత్ వెంకన్న, బట్టు శ్రీనివాస్, భద్య నాయక్, ప్రభురాణి, దనమ్మ, మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే మురళి నాయక్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



---

# ధర్మగడ్డ తండాలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు

**బిఎన్ఎస్ న్యూస్ దేవరుప్పుల, అక్టోబర్ 6**



దేవరుప్పుల మండలం ధర్మగడ్డ తండాలో బీఆర్ఎస్‌కు చెందిన వార్డు సభ్యులు, పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు, సర్పంచ్ అభ్యర్థి మూడ చందన దేవేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమంతో పాటు గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం ధర్మగడ్డ తండాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మూడ దేవేందర్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో వార్డు సభ్యురాలు భూక్య బికినీ, భూక్య శ్రీనివాస్, భూక్య సోమ్లా, బానోత్ శ్రీనివాస్, మూడ మహేష్, మూడ మనోజ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్, కాంగ్రెస్ మండల వీవర్స్ సెల్ అధ్యక్షుడు నల్ల యాదగిరి, నాయకులు పంగ ఐలయ్య, కున్సోత్ లక్ష్మణ్, మూడ జగురామ్, పంగ వెంకన్న, కాసర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.